## ప్రతి జాతిలోను ప్రవక్తను పంపడం జరిగింది

> "ప్రతి జాతిలోను ఒక ప్రవక్త వచ్చారు." (దివ్యఖుర్‌ఆన్ 10:47)

అల్లాహ్ వేలాది ప్రవక్తలను క్రమబద్ధంగా పంపించాడని ముస్లిములు విశ్వసిస్తారు. ప్రతి జాతిలోను కనీసం ఒక ప్రవక్తను పంపించడం జరిగింది. మానవాళి పట్ల కారుణ్యంగా మానవాళి మార్గదర్శనానికి వారిని పంపడం జరిగింది. కొన్ని సందర్భాలలో ఈ ప్రవక్తల అసలు సందేశం కాల గర్భాన కలిసిపోయింది. అందులో మార్పులు చేర్పులు జరిగాయి. లేదా మరపుకు గురైంది. కొన్ని సందర్భాల్లో ప్రజలు ఆ సందేశాన్ని తిరస్కరించారు. అందువల్లనే మళ్ళీ కొత్త ప్రవక్తను అల్లాహ్ సందేశాన్ని మరలా అందజేయడానికి పంపడం జరిగింది.

దేవుడు పంపిన ప్రతి ఒక్క ప్రవక్తను ముస్లిములు విశ్వసిస్తారు. వారిని గౌరవిస్తారు. ప్రవక్తలకు ఇవ్వబడిన దైవిక గ్రంథాలన్నింటిని విశ్వసిస్తారు. అయితే ఈ గ్రంథాలేవీ నేడు మూలరూపంలో భద్రంగా లేవన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటారు. ఒక్క దివ్యఖుర్‌ఆన్ తప్ప. **"ప్రవక్తా ఆయనే (అల్లాహ్‌యే) ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాడు. అది సత్యాన్ని తీసుకువచ్చింది. మునుపు అవతరించిన గ్రంథాలను ధృవపరుస్తుంది. దీనికి పూర్వం ఆయన మానవులకు రుజుమార్గం చూపటానికి తౌరాతు, ఇంజీలు గ్రంథాలను అవతరింపజేశాడు."** (దివ్యఖుర్‌ఆన్ 3:3)

## ప్రతి మనిషికి ప్రత్యక్షంగా దైవాదేశాలు ఎందుకు అందవు?

అల్లాహ్ జీవాన్ని సృష్టించాడు. మనిషికి ఆలోచనల, ఆచరణల స్వేచ్ఛనిచ్చాడు. తెలివితేటలు ప్రసాదించాడు. తన మార్గాన ఎవరు స్వచ్ఛందంగా నడుస్తారో, ఎవరు దారి తప్పుతారో పరీక్షించడానికి. ప్రతి మనిషికి ప్రత్యక్షంగా దైవాదేశాలు అందితే ఇక జీవితంలో నిజమైన పరీక్ష అనేదే ఉండదు. మనిషి విశ్వాసానికి సంబంధించిన నిజమైన పరీక్ష అతను తన తెలివితేటలను ఉపయోగించి, తన హేతుబుద్ధిని ఉపయోగించి దేవుని చిహ్నాలను గుర్తించాలి. అంతేకాని దేవునితో ప్రత్యక్షంగా మాట్లాడడం అంటే ఇక అతను పరీక్షించబడడమేమున్నది? అలాంటప్పుడు విశ్వాసం అనే మాట కూడా అర్థం లేనిదవుతుంది.

ప్రవక్తలు ప్రత్యక్షంగా దైవాదేశాలను పొందారు, అయినప్పటికీ వారికి కూడా జీవితంలోని పరీక్షలు తప్పలేదు. వారు అనేక కష్టనష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది.

## చిట్టచివరి ప్రవక్త

ప్రవక్తలను ప్రత్యేక సముదాయాల వద్దకు పంపడం జరిగేది. కాలక్రమాన వారు తీసుకువచ్చిన సందేశం మార్పులు చేర్పులకు గురికావడం, కాలగర్భాన కలిసిపోవడం జరిగింది. కాని, ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) ఏదో ఒక సముదాయం వద్దకు పంపబడలేదు. యావత్తు మానవాళి కొరకు పంపబడ్డారు. ఆయన ప్రచారం చేసిన సందేశం దివ్యఖుర్‌ఆన్, సున్నత్ (ప్రవక్త సంప్రదాయాలు) రూపంలో భద్రంగా ఉంది.

– దివ్యఖుర్‌ఆన్ అల్లాహ్ వాక్కు. అందులో ఎలాంటి మార్పులు చేర్పులు జరిగే అవకాశమే లేదు. లోపాలు, వైరుధ్యాలు లేనే లేవు.

ఈ గ్రంథం "మానవాళికి మార్గదర్శనం. (మంచి చెడులను వేరు చేసే) గీటురాయి" (దివ్యఖుర్‌ఆన్ 2:185)

– సున్నత్ అంటే ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) చెప్పిన మాటలు, చేసిన ఆచరణలు. వాటిని ఆయన అనుచరులు, వారి శిష్యులు నమోదు చేశారు. అత్యంత జాగ్రత్తగా వాటిని నమోదు చేయడం జరిగింది. వేలాదిగా ఈ రికార్డులు ఉన్నాయి. అందువల్ల ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక)ను అనుసరించడం చాలా తేలిక.

ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) ఆయన కాలం నుంచి ప్రపంచం ముగిసే వరకు ఆయనే ప్రవక్త. ప్రస్తుత తరానికి, రానున్న తరాలకు అందరికీ ఆయనే ప్రవక్త. నిజాయితీ, న్యాయం, కారుణ్యం, వాత్సల్యం, సత్యం, ధైర్యసాహసాల వ్యక్తిత్వానికి ఆయన అత్యుత్తమ ఉదాహరణ. ఇతర ప్రవక్తల మాదిరిగానే ఆయనలో కూడా ఎలాంటి చెడులు లేవు. కేవలం అల్లాహ్ కోసమే జీవించారు.

> ప్రవక్త ముహమ్మద్ సందేశం మిగిలిన ప్రవక్తల సందేశానికి పూర్తిగా అనుగుణమైనది.
> వారి సందేశాన్ని ధృవీకరిస్తుంది.

## ముగింపు

అల్లాహ్ కారుణ్యంగా ప్రవక్తలు ప్రభవించారు. అల్లాహ్ సందేశాన్ని ప్రజలకు చేరవేయడానికి, సన్మార్గజీవనాన్ని చూపించడానికి వచ్చారు. వారిలో ఉత్తమ గుణగణాలున్నాయి. వారిని అనుసరించడం, వారికి విధేయత చూపడం అవసరం.

ప్రవక్తను అనుసరించడం అంటే దేవునికి విధేయత చూపడం, ప్రవక్తను కాదనడం అంటే దేవుని తిరస్కరించడం. ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) ప్రవక్తలలో చిట్టచివరి వారు. ఆయన రాకతో దేవుని మార్గదర్శనం సంపూర్ణమైంది.

**అల్లాహ్‌ను, ఆయన పంపిన చిట్టచివరి ప్రవక్తను అనుసరించడం ద్వారా మన సాఫల్యం సంపూర్ణ మవుతుంది.**

> "వాస్తవంగా అల్లాహ్ ప్రవక్త (ముహమ్మద్)లో మీకు ఒక మంచి ఆదర్శం ఉంది. అల్లాహ్‌పై, అంతిమదినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికీ." (దివ్యఖుర్‌ఆన్ 33:21)


సంప్రదించండి
ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్
IIC
040 - 6832 7832 - Hyderabad


# ఇస్లామ్‌లో ప్రవక్తల పరంపర

నూహ్


ఇబ్రాహీమ్

మూసా

ఏసుక్రీస్తు

ముహమ్మద్

(వారందరిపై శాంతి కురియుగాక)



మౌలిక విషయాలు
తెలుసుకుందాం


040 - 6832 7832
Toll Free 1800 572 3000
www.discovertruepath.com
You Tube : DiscoverTruePath

విశ్వాన్ని, విశ్వంలోని సమస్తాన్ని సృష్టించిన దేవుడు మానవులను ఒక ఉన్నత ఉద్దేశ్యంతో సృష్టించాడు. కేవలం తనను మాత్రమే ఆరాధించాలని, తాను పంపించిన బోధనల, మార్గదర్శనాల ప్రకారం ధర్మపరాయణ జీవితాన్ని గడపాలని. అయితే దేవుని వద్ద నుంచి స్పష్టమైన మార్గదర్శనం లభించకపోతే మనిషి సన్మార్గంపై జీవితాన్ని గడపలేడు.

దేవుడు అనంత కరుణామయుడు, న్యాయశీలుడు. మనలను భూమిపై గమ్యరహితంగా వదిలేయలేదు. మన జీవితగమ్యమేమిటో తెలియజేయ డానికి కొందరు వ్యక్తులను ఎంపికచేసుకుని, వారి ద్వారా తన సందేశాన్ని అందజేశాడు. వారి ద్వారా సన్మార్గ జీవితాన్ని మానవాళికి చూపించాడు. ఈ వ్యక్తులను ప్రవక్తలని అంటారు. వారిలో ఆదమ్, నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ఈసా(ఏసుక్రీస్తు), ముహమ్మద్ (వారందరిపై దేవుని శాంతి కురియుగాక) ఉన్నారు.

## ప్రవక్తల లక్షణాలు

### ప్రవక్తలు దైవాదేశాలను గ్రహించారు

సాధారణ ప్రజలకు ప్రవక్తలకు మధ్య ముఖ్యమైన భేదం ఏమిటంటే, వారు అల్లాహ్ తరపునుంచి అవతరించే ఆదేశాలను గ్రహించేవారు.

> ప్రవక్త లందరికీ ఒకే విధమైన లక్షణాలున్నాయి. అందువల్లనే వారు అసాధారణ వ్యక్తులుగా గుర్తింపు పొందారు.

### ప్రవక్తలకు ఉత్తమ గుణగణాలుంటాయి

నడవడికలోను, గుణగణాల్లోను ప్రవక్తలు తమ జాతిలో అత్యుత్తమమైన వారిగా ఉంటారు.వారు దేవునికి విధేయులై జీవిస్తారు. అత్యున్నత స్థాయి నైతిక ప్రమాణాలు పాటిస్తారు. వ్యవహార శైలిలోను, మాటల్లోను సత్యవంతులుగా ఉంటారు. ప్రవక్తలకు పెద్ద పెద్ద పాపాలను ఆపాదిస్తు కొన్ని ఇతర మతాల్లో కనిపించే మాటలు పూర్తిగా అసత్యాలు, అందువల్లనే ముస్లిములు వాటిని పూర్తిగా తిరస్కరిస్తారు.

> ప్రవక్తలు ఎన్నడూ సంపదను, హెూదాను, అధికారం వంటి వ్యక్తిగత ప్రయోజనాలను కోరలేదు. వారు కేవలం దైవాభిష్టాన్నే కోరుకున్నారు.

### ప్రవక్తలు మహత్యాలను ప్రదర్శించారు

చాలా మంది ప్రవక్తలు మహత్యాలను ప్రదర్శించారు. సాధారణంగా తమ జాతి ప్రజలు ఎందులో నైపుణ్యం కలిగి ఉంటారో అదే రంగంలో వారు కూడా మహత్యాలను ప్రదర్శించారు. ఉదాహరణకు ప్రవక్త మూసా (ఆయనపై శాంతి కలుగుగాక)జాతి ప్రజలు మంత్రవిద్యలో ఆరితేరిన వారు. అప్పటి మంత్రగాళ్ళు కూడా ప్రదర్శించలేని అద్భుతమైన మహత్యాలను ప్రవక్త మూసా(అ) చేసి చూపించారు. ఏసుక్రీస్తు (ఆయనపై శాంతి కలుగుగాక) జాతి ప్రజలు వైద్యరంగంలో ప్రగతి సాధించినవారు. అందువల్లనే ఏసుక్రీస్తు(అ) తన జాతి ప్రజలు కూడా చేయలేని అద్భుతమైన వైద్యశాస్త్ర మహత్యాలను ప్రదర్శించారు. ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) జాతి ప్రజలు కవిత్వంలో గొప్ప ప్రతిభ కలిగిన వారు. అందువల్లనే ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) దివ్యఖుర్ఆన్ వంటి మహత్యాన్ని ప్రదర్శించారు. అందులోని సాహిత్యసౌరభాలు, శైలి ప్రత్యేకతలను కవులెవ్వరు అందుకోలేక పోయారు. అంతేకాదు చాలా మంది ప్రవక్తలు భవిష్యవాణులు వినిపించారు. అవన్నీ నిజమయ్యాయి. ఈ మహత్యాలను దేవుని అనుమతితో, దేవుని సహాయంతో మాత్రమే ప్రదర్శించగలిగారు. ఎందుకంటే వారు కూడా మానవమాత్రులే, దైవికశక్తులు కలిగిన వారు కాదు.

## ప్రవక్తలకు దైవత్వం లేదు

విశ్వప్రభువు అల్లాహ్ ఎన్నుకున్న వారు ప్రవక్తలు. కాని వారికి దైవత్వం ఎంతమాత్రమూ లేదు. అందువల్ల వారిని ఆరాధించరాదు. ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక)ను అల్లాహ్ స్పష్టంగా ఇలా చెప్పమని ఆదేశించాడు. **"నేను కూడా మీలాంటి మనిషినే. మీ దేవుడు ఒకే ఒక్క దేవుడని నాకు దైవం తెలియజేశాడు."** (దివ్యఖుర్ఆన్ 18:110)

బైబిలు పాత, కొత్త నిబంధనలద్వారా కూడా ఇది స్పష్టంగా అర్థమవుతూనే ఉంది. ప్రవక్తలకు దైవత్వం లేదు. వారు నిజమైన దేవుని ముందు సాష్టాంగపడేవారు. ఆరాధించేవారు.

**".....అతను మరింత ముందుకు వెళ్ళాడు. తన ముఖాన్ని నేలకు ఆన్చి ప్రార్థించాడు" (మత్తయి 26:39) ".....వారు(మూసా, హారూన్లు) ముఖాన్ని నేలకు ఆన్చారు"(సంఖ్యా.కాం. 16:22) "......అబ్రాం (అంటే ఇబ్రాహీం) తన ముఖాన్ని నేలకు ఆన్చాడు. దేవుడు అతనితో మాట్లాడాడు."(ఆది కాం. 17:3)**

## ప్రవక్తలకు అవసరమైన గుణగణాలున్నాయి

అల్లాహ్ – ప్రవక్తలకు కొన్ని విశిష్ట గుణగణాలు ప్రసాదించాడు. వారు తమ ఉద్యమాన్ని జయప్రదంగా కొనసాగించడానికి ఈ గుణగణాలు ఇవ్వబడ్డాయి. అవి, నిరంతర ప్రయత్నం, ధైర్యం, నాయకత్వం, సహనం, వివేకం

కొన్ని ఉదాహరణలు చూడండి:

– నూహ్ ప్రవక్త (ఆయనపై శాంతి కురియుగాక) తన జాతిలో చాలా కొద్ది మంది మాత్రమే విశ్వసించినప్పటికీ అల్లాహ్ వైపునకు ప్రజలను పిలిచే నిరంతర ప్రయత్నాన్ని కొనసాగించారు.

– చాలా చిన్న వయసులోను ప్రవక్త ఇబ్రాహీమ్ (ఆయనపై శాంతి కురియుగాక) తన జాతి ప్రజల అసత్య విశ్వాసాలను ధైర్యంగా ఎదిరించారు.

– మూసా ప్రవక్త (ఆయనపై శాంతి కురియుగాక) ఆ కాలంలో అత్యంత నిరంకుశ పాలకుడైన ఫారో నిర్బంధం నుంచి తన జాతి ప్రజలను తప్పించడంలో అద్భుతమైన నాయకత్వం ప్రదర్శించారు.

– ఏసుక్రీస్తు (ఆయనపై శాంతి కురియుగాక) తన జాతి ప్రజల దౌర్జన్యాలను, హింసాకాండను ఎంతో సహనంగా భరించారు.

– ఎల్లప్పుడు యుద్ధాలు రక్తపాతాల్లో గడిపే వివిధ అరబ్బు తెగలను ఒక శాంతియుత సముదాయంగా మార్చడంలో ప్రవక్త ముహమ్మద్ (ఆయనపై శాంతి కురియుగాక) అద్భుతమైన వివేకాన్ని ప్రదర్శించారు.

## ప్రవక్తల సందేశం

ఒకే నిజమైన దేవుడు ప్రవక్తలందరినీ పంపించాడు కాబట్టి, వారంతా ఒకే సందేశాన్ని ప్రచారం చేశారు. వారందరి ఉద్యమం ఒక్కటే. ప్రజలకు జీవితలక్ష్యం ఏమిటో తెలియజేయడం.

**"అసత్య దేవుళ్ళను వదిలి పెట్టాలని, కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలన్న సందేశంతో మేము ప్రతి జాతి వద్దకు ప్రవక్తలను పంపించాము." (దివ్యఖుర్ఆన్ 16:36)**

### వారి సందేశం :

– నిజమైన దైవభావనను వివరించి, అసత్య విశ్వాసాలను తిరస్కరించడం.

– నిజమైన జీవితలక్ష్యం గురించి బోధించడం

– అల్లాహ్‌ను ఎలా ఆరాధించాలో చేసి చూపించడం

– అల్లాహ్ నిర్వచించిన సన్మార్గమేదో, దుర్మార్గమేదో తెలియజేసి అందుకు అనుగుణంగా ప్రజలకు దారిచూపడం.

– దైవవిధేయతకు బహుమానం (స్వర్గం) గురించి వర్ణించడం. అవిధేయతకు శిక్ష (నరకం) గురించి హెచ్చరించడం.

– సాధారణంగా అపోహలకు గురయి ఉన్న విషయాలు – ఆత్మ, దైవదూతలు, విధి, పరలోకం గురించి వివరించడం.

> "మేము మా సందేశాన్ని అందజేసే నిమిత్తం ప్రవక్తను పంపినప్పుడల్లా, అతడు తన జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే మా సందేశాన్ని అందజేశాడు, వారికి అతడు విషయాన్ని చక్కగా అర్థమయ్యేట్లు చెప్పటానికి..." (దివ్యఖుర్ఆన్ 14:4)

ప్రవక్తలందరి ప్రధానోద్దేశ్యం దైవానికి సంబంధించిన భావనలో స్పష్టతను ఇవ్వడం. అంటే, దేవుడికి సరిసమానులెవ్వరూ లేరు, ఆయనకు భాగస్వాములెవ్వరూ లేరు. ఆరాధనలన్నీ కేవలం ఆయనకు మాత్రమే పరిమితం. దివ్య ఖుర్ఆన్‌లో అనేక చోట్ల ప్రవక్తలు ఈ సందేశాన్ని ప్రకటించిన ఉదాహరణ లున్నాయి.

**నూహ్** (ఆయనపై శాంతి కురియుగాక) ఇలా ప్రకటించారు:

**"ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో దైవం లేదు" (దివ్యఖుర్ఆన్ 7:59)**

**ఇబ్రాహీమ్** (ఆయనపై శాంతి కురియుగాక) ఇలా ప్రకటించారు:

**"అల్లాహ్‌ను కాక ఇతరులను మీరు ఆరాధిస్తారా? మీకు లాభం కాని నష్టం కాని కలిగించలేని వాటిని..." (దివ్యఖుర్ఆన్ 21:66)**

**మూసా** (ఆయనపై శాంతి కురియుగాక) ఇలా ప్రకటించారు:

"నేను అల్లాహ్‌ను కాదని మరో దైవాన్ని మీ కొరకు అన్వేషించాలా? వాస్తవానికి ప్రపంచంలో సమస్త జాతులకంటే మీకు ఔన్నత్యాన్ని ప్రసాదించింది అల్లాహ్‌యే." (దివ్యఖుర్ఆన్ 7:140)

**ఏసుక్రీస్తు** (ఆయనపై శాంతి కురియుగాక) ఇలా ప్రకటించారు:

"నిస్సందేహంగా అల్లాహ్‌యే నాకు ప్రభువు, మీకు ప్రభువు. కాబట్టి ఆయన్నే ఆరాధించండి. ఇదే రుజుమార్గం." (దివ్యఖుర్ఆన్ 3:51)

**ముహమ్మద్** (ఆయనపై శాంతి కురియుగాక) ఇలా ప్రకటించారు:

"... నాకు వహీద్వారా ఇలా తెలుపబడింది. మీ దైవం కేవలం ఒకే ఒక దైవం. కనుక తన ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడు సత్కార్యాలు చేయాలి. ఆరాధనలో తన ప్రభువుతో పాటు మరెవ్వరినీ చేర్చకూడదు."

(దివ్యఖుర్ఆన్ 18:110)

ఈ సందేశం అనేక తరాలుగా ఒకేవిధంగా కొనసాగుతూ వచ్చింది. దేవునికి సంబంధించి సరైన విశ్వాసం ఎంత అవసరమో చాటి చెబుతుంది.